

జిల్లా కలెక్టర్‌గా అద్వైత్‌కుమార్‌సింగ్



మహబూబాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నూతన కలెక్టర్‌గా 2013 బ్యాచ్‌కు చెందిన అద్వైత్‌కుమార్‌సింగ్ బదిలీపై వస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 మంది కలెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా మహబూబాబాద్‌లో కలెక్టర్‌గా పని చేస్తున్న శశాంక రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్నారు. ఆయన స్థానంలో కేంద్రసర్వీసులో డిప్యూటేషన్‌లో పనిచేస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్ మానుకోట కలెక్టర్‌గా వస్తున్నారు. కాగా, బదిలీపై వెళ్తున్న కలెక్టర్ శశాంక 1 సెప్టెంబరు 2021లో రాగా, దాదాపు 28 నెలలపాటు ఇక్కడ విధులు నిర్వర్తించారు.

జాడలేని వాకింగ్ ట్రాక్



మహబూబాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాకింగ్ చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, వాకర్స్ (ఫైల్)

- మానుకోటలో రోడ్లవెంట నడుస్తున్న జనం
- పట్టణంలో రోజూ ఉదయం 5వేల మంది నడక..
- రక్షణ లేక ఓపెన్‌జిమ్‌ల్లో దెబ్బతింటున్న పరికరాలు
- వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్

మార్నింగ్ వాక్‌కు వాకర్స్ ఇబ్బందులు

మహబూబాబాద్ టౌన్, జనవరి 3 : ఆరోగ్యానికి మించిన ఆస్తిలేదు.. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు.. ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా ఉండటానికి ఉదయాన్నే వాకింగ్, వ్యాయామం చేస్తున్నారు. ఒకప్పుడు ఉదయాన్నే లేచి వ్యాయామానికి వెళ్లాలంటే ఎవరో ఒకరు వెళ్లేవారు. ప్రస్తుతం తీసుకుంటున్న ఆహారం, ఉద్యోగం, విధులు, పనుల్లో ఒత్తిడితో మానసిక ఆందోళనకు గురవుతున్న వారంతా వ్యాయామం వైపు దృష్టి సారించారు. చిన్నారుల నుంచి మొదలుకుని వృద్ధుల వరకు ఇలా ప్రతీ ఒక్కరు తమ నిత్యం పనిలో వాకింగ్ ఒకటిగా ఎంచుకుంటున్నారు. ఎన్ని పనులున్నా ఉదయాన్నే మైదానాలకు పరుగులు తీస్తున్నారు.

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో వాకింగ్ కోసం ట్రాక్‌లు లేక రోడ్డు వెంట నడుస్తున్నారు. ఖచ్చితంగా వాకింగ్ ట్రాక్‌పైన నడవాలని వ్యాయామ నిపుణులు సూచిస్తున్నారు. మానుకోటలో సరిపడ లేకపోవడంతో చిన్నారులు, యువకులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. దినదినాభివృద్ధి చెందిన పట్టణంలో వాకర్స్ కోసం ప్రత్యేకంగా మైదానాల్లో వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలనే డిమాండ్ వెల్లువెత్తుతోంది.

జిల్లా కేంద్రంలో నిత్యం ఐదువేలకు పైగానే వాకింగ్..

మానుకోట పట్టణంలో నిత్యం దాదాపుగా 5 వేల మందికి పైగానే వాకింగ్ చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని పాత బజారులో బస్టాండ్ సమీపంలో ఎన్టీఆర్ స్టేడియం.. రైల్వేస్టేషన్ సమీపంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో కలిపి దాదాపుగా 2 వేల నుంచి 3 వేలకు మందిగానే వాకర్స్ నడుస్తారు. ఎన్టీఆర్ స్టేడియంలో కనీసం వాకింగ్ ట్రాక్ కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలోని క్రీడా మైదానంలో గతంలో వాకింగ్ ట్రాక్ వేసినప్పటికి ,అది శిథిలావస్థకు చేరుకుంది. దీంతో వాకర్స్ ఇక్కడ కూడా ఇబ్బందులు పడుతున్నారు. వాకర్స్ అసోసియేషన్‌లు ఈ విషయాన్ని గతంలో పాలకుల దృష్టికి తీసుకుపోయారు. కొత్త బజారులోనైతే కనీసం వాకింగ్ చేయడానికి మైదానం కూడా లేదంటే అతిశయోక్తి కాదు. కొద్దిమంది మునిసిపల్ పార్కులు, అనంతారం, శనిగపురం, జమాండ్లపల్లికి వెళ్లే రోడ్ల వెంట నడుస్తున్నారు.

గతంలో రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న గాంధీపార్కులో వాకింగ్ ట్రాక్‌ను సిద్ధం చేసి, అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేయగా తొర్రూరు బస్టాండ్ వద్ద పాత కూరగాయల మార్కెట్ స్థలంలో ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్ నిర్మాణం చేస్తుండడంతో అక్కడి మార్కెట్‌ను గాంధీపార్కుకు తరలించారు. దీంతో అది కూడా ఉపయోగంలోకి రాకుండాపోయింది. ప్రస్తుతం మోడల్ మార్కెట్ పూర్తి కావడంతో కూరగాయల మార్కెట్‌ను అందులోకి తరలించి గాంధీపార్కును వ్యాయామానికి ఉపయోగపడేలా వాకింగ్ ట్రాక్‌ను నిర్మించి, అందుబాటులోకి తీసుకురావాలని వాకర్స్ విజ్ఞప్తి చేస్తున్నారు. మానుకోట పట్టణ నడిబొడ్డున ఉన్న గాంధీపార్కులో వాకింగ్ ట్రాక్ వేసి అందుబాటులోకి తీసుకువస్తే మహిళలకు రక్షణగా ఉంటుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు అనంతారం సమీపంలోని దాశరథి స్మృతి వనం వద్ద వాకింగ్ చేయడానికి వాకింగ్ ట్రాక్, వ్యాయామం చేయడానికి ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇటీవల కొలువుదీరిన కొత్త ప్రభుత్వం, పాలకులు దృష్టి సారించి, పెరి గిన జనాభాకనుగుణంగా వారి ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకుని వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేసి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని వేడుకుంటున్నారు.



మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసి ఓపెన్ జిమ్

రూ.11లక్షలు వెచ్చించి..

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా పూర్వ రాష్ట్రప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని అన్ని మునిసిపాలిటీల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే మహబూ బాబాద్ పట్టణంలో పట్టణ ప్రగతి నిధుల నుంచి ఒకొక్క జిమ్‌కు రూ.11 లక్షలు వెచ్చించి, 9 ప్రాంతాల్లో జిమ్‌లను ఏర్పాటు చేసి 15 రకాల వ్యాయామ పరికరాలను అందుబాటులో ఉంచారు. ప్రజలకు అనూకూలంగా ఉండే విధంగా కొన్ని మైదానాల్లో ఏర్పాటు చేయగా మరి కొన్నింటిని పార్కుల్లో ఏర్పాటు చేశారు. అయితే పార్కుల్లో నిర్మించిన వాటికి రక్షణ ఉంది. కానీ, మైదానాల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లకు రక్షణ లేక పోవడంతో పరికరాలు దెబ్బతింటున్నాయి. ఇటీవల కాలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యాయామ పరికరాలు దెబ్బతినడంతో ఈ విషయాన్ని పాలకులు, అధికారుల దృష్టికి వాకర్స్ తీసుకురావడంతో మునిసిపల్ అధికారులు మరమ్మతులు చేయించారు. రక్షణ లేని ఓపెన్ జిమ్‌లకు చుట్టూ జాలి పెట్టి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయాలి..

నల్లు సుధాకర్‌రెడ్డి, వాకర్, మానుకోట



మహబూబాబాద్ పట్టణంలో నిత్యం అనేక మంది వాకింగ్ చేస్తున్నారు. ఆరోగ్యాలను కాపాడుకోవడానికి ఉదయం నడక, వ్యాయామం తప్పనిసరి అయింది. పెరుగుతున్న వాకర్స్ సంఖ్యను దృష్టిలో పెట్టుకుని పట్టణంలో అనూకూల ప్రాంతాల్లో వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయాలి. గాంధీ పార్కులో వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసి, అందుబాటులోకి తీసుకురావాలి.

సేద తీరడానికి వసతులు కల్పించాలి..

పట్టాభి లక్ష్మయ్య, వాకర్, మానుకోట



జిల్లా కేంద్రంలో ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసే వారికి మైదానాల్లో సేద తీరడానికి కనీస వసతులు కల్పించాలి. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ఎన్టీఆర్ స్టేడియంలో వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేసి, వాకర్స్ సేద తీరడానికి బెంచీలు ఏర్పాటు చేయాలి. అంతే కాకుండా పట్టణంలో ప్రాంతాల వారీగా వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయాలి.

ఉపాధి హామీకి ఆధార్‌ను తప్పనిసరి చేయడం సరికాదు

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జి.నాగయ్య

మహబూబాబాద్‌టౌన్, జనవరి 3 : ఉపాధి హామీ పథకానికి ఆధార్ తప్పని సరి చేయడమంటే.. చట్టంపై దాడి చేయడమేనని సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో బుధవారం సీపీఎం జిల్లా కమిటీ సమావేశాన్ని శెట్టి వెంకన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం (ఎన్ఆర్ ఈజీఎస్) పట్ల ప్రధాని మోదీ తీసుకున్న చర్యను తీవ్రంగా ఖండించారు. ఉపాధిహామీ చట్టం కింద ప్రతీ గ్రామీణ కార్మికుడికి జాబ్‌కార్డు హక్కు ఉంటుందని, తద్వారా వారికి కనీసం ఏడాదిలో వంద రోజులు పని కల్పించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం దేశ వ్యాప్తంగా జాబ్ కార్డులున్న వారు 25.25 కోట్లు ఉన్నారని పేర్కొన్నారు. వరుసగా గత మూడేళ్లలో పనిచేయని వారు కేంద్రం నూతనంగా తీసుకువచ్చిన చట్టం ద్వారా సుమారు 10 కోట్లమంది అనర్హత వేటువేసే ప్రమాద ముందన్నారు. గ్రామీణ భారతంలో అనేక ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో పని ప్రదేశాల్లో కార్మికుల హాజరు ఆమోదం పొందలేదన్నారు. ఆధార్ ప్రాతిపదికన చెల్లింపు వ్యవస్థకు తప్పనిసరి అని ముడిపెట్టడాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, గునిగంటి రాజన్న, ఆకుల రాజు, సూర్నపు సోమయ్య, అల్వాల వీరయ్య పాల్గొన్నారు.

ఎస్సెస్సీలో ఉత్తమ ఫలితాలు సాధించాలి : డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న రామారావు

నెల్లికుదురు, జనవరి 3 : పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానం సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు తెలిపారు. నెల్లికుదురు మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల, జీహెచ్ఎస్ పాఠశాల, మునిగలవీడు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సెస్సీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, వార్షికపరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. టెన్త్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. ఏసీజీ మందుల శ్రీరాములు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జీవన్ కుమార్, రవి, ఎన్.స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

- తల్లి ప్రాణాలను బలిగొన్న కొడుకు వివాహేతర సంబంధం
- భూపాలపల్లి జిల్లాలో ఘటన



పద్మ (ఫైల్)

మహదేవపూర్ రూరల్, జనవరి 3: కొడుకు పెట్టుకున్న వివాహేతర సంబంధం తల్లి హత్యకు దారి తీసింది. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో ఈ సంఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబట్‌పల్లికి చెందిన నల్లా పద్మ, భూమయ్య దంపతుల కుమారుడు అవినాష్ అదే గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. కొంతకాలంగా ఈ వ్యవహారం నడుస్తుండగా ఆ మహిళ భర్త పుట్టా నర్సింహస్వామికి విషయం తెలిసింది. దీంతో కోపోద్రిక్తుడైన అతడు అవినాష్‌ను మట్టుబెట్టాలని ప్లాన్ చేశాడు. బుధవారం ఉదయం గ్రామంలోని అమరేశ్వరాలయం వద్ద అవినాష్ ఉన్నాడని తెలుసుకొని గొడ్డలితో అక్కడికి చేరుకున్నాడు. అవినాష్‌పై దాడి చేసేందుకు యత్నించగా అయ్యప్ప భక్తులు అడ్డుకున్నారు. నర్సింహస్వామి బారి నుంచి తప్పించుకున్న అవినాష్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ క్రమంలో కోపం చల్లారని నర్సింహస్వామి అదే గొడ్డలితో అతడి ఇంటికి వెళ్లాడు. అవినాష్ ఇంటికి వచ్చి ఉంటాడని భావించి బయట నుంచి కేక వేశాడు. ఆ సమయంలో అవినాష్ ఇంట్లో లేడు. అతడి తల్లి నల్లా పద్మ(40) బయటకు వచ్చి చూడగా నర్సింహస్వామి గొడ్డలితో ఉన్నాడు. ఎందుకిలా వచ్చావని అతడిని పద్మ అడిగింది. అవినాష్‌ను హత్య చేయడానికి వచ్చానని నర్సింహస్వామి సమాధానం చెప్పాడు. 'ఎందుకు చంపాలనుకుంటున్నావు.. నా కొడుకు ఏం చేశాడు?' అని పద్మ అడగుడుతుండగానే నర్సింహస్వామి ఆమెపై అదే గొడ్డలితో దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో ఆమె కుప్పకూలి అక్కడే ప్రాణాలు వదిలింది. మృతురాలి భర్త భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. నిందితుడు నర్సింహస్వామి పరారీలో ఉన్నాడని చెప్పారు. పద్మ, భూమయ్య దంపతులు అంబ్‌పల్లిలోనే మిర్చి బండి నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి అవినాష్‌తోపాటు కూతురు ఉంది. అవినాష్ అవివాహితుడు కాగా ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నిందితుడు నర్సింహస్వామి అదే గ్రామంలో టెంట్‌హౌస్ నిర్వహిస్తున్నాడు.

వేడినీళ్లు మీదపడి.. చికిత్స పొందుతూ బాలుడు మృతి



లక్ష్మణ్ (ఫైల్)

డోర్నకల్ , జనవరి 3 : వేడినీళ్లు మీదపడి తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ మూడేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలోని రాముతండాలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. బుధవారం డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం. రాముతండాకు చెందిన నూనావత్‌వీరన్న-కల్యాణి దంపతులకు మూడేళ్ల క్రితం తొలికాన్పులోకవలలు రామ-లక్ష్మణ్ జన్మించారు. గత డిసెంబర్ 31న తల్లి కల్యాణి స్నానం చేసేందుకు బకెట్‌లో వేడినీటి పెట్టుకుని పని నిమిత్తం ఇంట్లోకి వెళ్లింది. అదే సమయంలో రామలక్ష్మణ్‌లు బకెట్ వద్దనే ఆడుకుంటుండగా ఇందులో లక్ష్మణ్ బకెట్‌ను గుంజాడు. దీంతో మరుగుతున్న వేడినీరు లక్ష్మణ్‌పై పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స నిర్వహించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి వెళ్లాలని వైద్యులు సూచించడంతో అక్కడికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మణ్ మంగళవారం రాత్రి మృతి చెందాడు.

డోర్నకల్ పోలీసుల సూచనతో అఫ్జల్‌గంజ్ పోలీసుల సమక్షంలో ఉస్మానియా వైద్యులు లక్ష్మణ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, తల్లిదండ్రులకు అప్పగించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉపేందర్‌రావు తెలిపారు.

గడపగడపకు అయోధ్య రామమందిర అక్షింతలు



కేసముద్రంలో అయోధ్య రాముని అక్షింతలతో ఊరేగింపు నిర్వహిస్తున్న రామభక్త బృందం

మరిపెడ రూరల్, జనవరి 3 : మండలంలోని అబ్బాయిపాలెంలో గడపగడపకు అయోధ్య శ్రీరామ మందిరం అక్షింతలను చేరే విధంగా చూడాలని గ్రామ పెద్దలు వంటికొమ్ము శ్రీనివాసరెడ్డి, తల్లాడ వెంకటరామారావు, రామభక్తులు అనుముల మనోజ్, వేమునూరి శ్రావణ్, రాయల నరేష్, పోగుల శంకర్, చౌడారపు హరికిషన్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ శ్రీరామ జన్మభూమితీర్థక్షేత్ర ట్రస్ట్ నుంచి వచ్చిన అక్షింతలు ఇంటింటికి రామభక్తులు పంపించాలన్నారు. కురియముల అఖిల్, మంగీలాల్, రమేష్, సుభద్ర, అలువాల సీతారాములు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

- కేసముద్రం : కేసముద్రం స్టేషన్‌లో అయోధ్య రామ జన్మభూమి నుంచి వచ్చిన అంక్షింతలు, కలశాలతో రామభక్త బృందం ఆధ్వర్యంలో శోభాయాత్రను నిర్వహించారు. స్థానిక రామమందిరం నుంచి బ్రహ్మంగారి గుడిసెంటర్ వరకు ఈ యాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమంలో రామజన్మభూమి తీర్థక్షేత్ర జిల్లా బాధ్యులు వేలం శ్రీనివాస్, కందాళం వాసుదేవాచార్యులు, లెంకలపెల్లి శ్రీనివాస్, బచ్చు లక్ష్మీనారాయణ, మదారి దినేష్, తాటికొండ రామారావు తదితరులు పాల్గొన్నారు.
- కురవి : అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలను కురవిలో ర్యాలీగా రామాలయానికి తీసుకువచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు మేళతాళాల నడుమ ఊరేగింపు నడుమ కోలాటలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డుసభ్యులు నూతక్కి నర్సింహారావు, సకినాల భద్రయ్య, కర్నాటి మోహన్‌రావు, కర్నాటి వాసు, కర్నాటి నాగన్న, సముద్రాల ప్రకాష్, క్రాంతికుమార్, ప్రసాద్, నవీన్, శ్రీరాం వెంకన్న, గంధం శ్రీను, కొదుమూరి వెంకటేశ్వర్లు, కర్నాటి మల్లికార్జున్, ఎస్వీఎస్ రాజు, బాలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.
- పెద్దవంగర : చిట్యాల గ్రామ శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో అయోధ్య శ్రీరాముని వద్ద పూజింపబడిన పవిత్రమైన అక్షింతలను పెద్దవంగరలో భక్తులు బైకుర్యాలీతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయోధ్యలో రామమందిరం నిర్మాణం చేపట్టడడం చాలా గొప్ప విషయమన్నారు. దీంతో మండల కేంద్రంలో శ్రీరామనామస్మరణతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఏదునూరి చరణ్, మహేష్, శ్యామ్, అనుదీప్, ప్రవీణ్, కళ్యాణ్, శ్రీకాంత్, కిరణ్, సురేందర్, వినోద్, ఎల్లస్వామి పాల్గొన్నారు.
- గార్ల : మండల కేంద్రంలో అయోధ్య రామయ్య సన్నిధి నుంచి వచ్చిన అక్షింతలతో రామ భక్తులు శోభాయయాత్రను కన్నులపండువగా జరిపారు. స్థానిక లక్ష్మీనారాయణ దేవాలయంలో భద్రపర్చిన అంక్షింతలను మహిళలు నెత్తిన పెట్టుకొని పట్టణ పుర విధుల్లో జైశ్రీరాం అంటూ నినాదాలు చేశారు. సర్పంచ్ అజ్మీరా బన్సీలాల్, మాజీ సర్పంచ్ గంగావత్ లక్ష్మణ్‌నాయక్, శీలంశెట్టి ప్రవీణ్‌కుమార్ నాయుడు, ఎంపీటీసీలు శీలంశెట్టి రమేష్, మాలోత్ వెంకట్ లాల్‌నాయక్, తాళ్లపల్లి కృష్ణగౌడ్, కమల్‌కుమార్ అగ్రవాల్ పాల్గొన్నారు.

ఉద్యమకారులను దూషించిన టౌన్ సీఐ

ఎస్పీకి ఫిర్యాదు చేసిన ఉద్యమకారులు



మానుకోట అమరవీరుల స్థూపం వద్ద మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారులు

మహబూబాబాద్ రూరల్, జనవరి 3 : తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాల్గొని, కేసులపాలైన ఉద్యమకారులను టౌన్ సీఐ సతీష్ అసభ్య పదజాలంతో దూషించారని జిల్లాకు చెందిన ఉద్యమకారులు అహ్మద్‌ఖాన్, చెక్కుల అశోక్, ఎస్‌కె.ఖయ్యూం బుధవారం ఆరోపించారు. అనంతరం ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం వారిని గుర్తించి ఒక్కొక్కరికి 250 గజాల ఇంటిస్థలం ఇవ్వాలని నిర్ణయించడంతో ప్రజాపాలన కార్యక్రమంలో కేసులపాలైన వారి వివరాలను దరఖాస్తు ఫారంలో నమోదు చేస్తున్నారు. అందుకు గత మూడ్రోజులుగా టౌన్ పోలీస్‌స్టేషన్ చుట్టు తిరిగినప్పటికి సీఐ తమను పట్టించుకోవడం లేదని వివరించారు. దీంతో తాము ఎమ్మెల్యే మురళీనాయక్‌ను కలిసి విన్నవించుకున్నామని, స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సీఐ సతీష్‌కు ఫోన్‌చేసి వారికి సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరినప్పటికి.. ఎమ్మెల్యే మాటలు సైతం ఖాతర్ చేయకుండా తమను అసభ్య పదజాలంలో దూషించారని ఆరోపించారు.

టౌన్ సీఐ సతీష్ ఎస్పీ కార్యాలయానికి అటాచ్

మానుకోట టౌన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న సతీష్‌ను బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని డీసీఆర్బీకి అటాచ్ చేస్తూ ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో సతీష్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో డిసెంబర్ 23న డీసీఆర్బీకి అటాచ్ చేయగా.. డిసెంబర్ 27న తిరిగి టౌన్ సీఐగా మళ్లీ వచ్చారు. ఏం జరిగిందో ఏమోకానీ వారం రోజులు కాకముందే మరోసారి సతీష్‌ను జిల్లా ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. కాగా, టౌన్ ఇన్‌చార్జి సీఐగా రూరల్ సీఐ రమేష్‌ను బాధ్యతలు అప్పగించారు.

రిటైర్డ్ రైల్వే ఉద్యోగి ఇంట్లో చోరీ

- మూడు తులాల బంగారం అపహరణ



కేసముద్రం కిష్టాపురం వీధిలో చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

కేసముద్రం, జనవరి 3 : కేసముద్రం స్టేషన్ కిష్టాపురం వీధిలో బుధవారం రిటైర్డ్ రైల్వే ఉద్యోగి ఎర్రబోయిన రాంచంద్రయ్య ఇంట్లో చోరీ జరిగిందని ఎస్ఐ వంశీధర్ తెలిపారు. రాంచంద్రయ్య నెల్లికుదురులోని తన బంధువుల ఇంటికి వెళ్లగా రైల్వే ఉద్యోగి అయన కుమారుడు సంతోష్ మంగళవారం సాయంత్రం ఇంటికి తాళంవేసి విధులకు హాజరయ్యాడు. ఉదయం తిరిగివచ్చే సరికి ఇంటికి వేసిన తాళం తీసి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారం చోరీకి గురైనట్లు పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. బీరువాలోని మరి కొన్ని ఆభరణాలు చోరీకి గురికాకుండా అలాగే ఉన్నట్లు తెలిసింది. బాధితుల ఫిర్యాదుపై అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా తొలుత భారీగా బంగారం, నగదు అపహరణకు గురైనట్లు అందిన సమాచారంతో రూరల్ సీఐ రమేష్ ఘటనస్థలాన్ని పరిశీలించారు. మహబూబాబాద్ నుంచి క్లూస్ టీంను రప్పించి, ఆధారాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ దాడులు

- ముగ్గురు బైండోవర్

నెహ్రూసెంటర్, జనవరి 3 : అనంతారం, రాంసింగ్‌తండా, సుందరయ్య నగర్‌లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి, ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ ఎక్సైజ్ సీఐ చిరంజీవి తెలిపారు. బుధవారం ఆయా గుడుంబాస్థావరాలపై దాడులు నిర్వహించి 500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 50 కిలోల బెల్లం, 15 లీటర్ల నాటుసారాను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఇందుకు బాధ్యులైన అనంతారం గ్రామానికి చెందిన ఎడ్ల పగడయ్య, ఎడ్ల ఎల్లబాయి, అజ్మీర శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో కృష్ణమూర్తి, హరీష్, వెంకట్రాం రెడ్డి, శివకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

భార్య అస్థికలు గోదావరిలో కలిపి.. మనస్తాపంతో భర్త ఆత్మహత్య



వెంకటయ్య (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 3 : నెల రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన భార్య అస్థికలను గోదావరిలో కలిపి వచ్చిన భర్త మరుసటిలో రోజు బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్ గ్రామానికి చెందిన లొంక వెంకటయ్య (57) భార్య అండాలు నెలరోజుల క్రితం మృతి చెందింది. మంగళవారం ఉదయం కుటుంబసభ్యులు భద్రాచలం వెళ్లి ఆమె అస్థికలను గోదావరి నదిలో కలిపి రాత్రికి ఇంటికి చేరుకున్నారు. అప్పటి నుంచి భార్యను గుర్తు చేసుకుంటూ మనస్తాపం చెందిన వెంకటయ్య బుధవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి గ్రామ శివారులోని పురుగుల మందుతాగి పడిపోయాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు వెంటనే ఆయనను వరంగల్ ఎంజీఎంకు తరలించగా, అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సీఐ సట్ల రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గౌడ కమ్యూనిటీ హాల్‌కు రూ.20 లక్షల ఎంపీ నిధులు



హైదరాబాద్‌లో గౌడ సంఘానికి నిధుల మంజూరు పత్రం ఇస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

కేసముద్రం, జనవరి 3 : కేసముద్రం మండలం అమినాపురంలో గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తన ఎంపీ నిధుల్లోంచి రూ.20 లక్షలను మంజూరు చేసినట్లు కౌండిన్య గౌడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు చిర్ర యాకాంతంగౌడ్ తెలిపారు. గతంలోనే గౌడ సంఘం నాయకులు అయన్ను కలిసి చేసిన విజ్ఞప్తి మేరకు బుధవారం నిధుల మంజూరు లేఖను సంఘం బాధ్యులకు ఎంపీ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీకి గౌడ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారులు చీకటి వేలాద్రి, కన్న యాకయ్య, చింతనూరి వెంకన్న, మోడెం రవీందర్‌గౌడ్, వేముల రాజేష్ పాల్గొన్నారు.

ఇద్దరికి కరోనా



హనుమకొండ అర్బన్, జనవరి 3 : ఎంజీఎం ఆస్పత్రిలో బుధవారం 40 మంది రోగులు ఓపీ విభాగానికి రాగా, 26 మందికి ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించామని, వీటిలో రెండు పాజిటీవ్‌గా నమోదు అయ్యాయని ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, ఎజీఎం కొవిడ్ వార్డులో ప్రస్తుతం ఆరుగురు రోగులు చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు.

వీరభద్రుడిపై చిన్న చూపేల..?

- దాతల సహకారంతోనే అభివృద్ధి
- నిధులు కేటాయించని ప్రభుత్వం
- నేడు వీరభద్రస్వామి జాతర అభివృద్ధి సమీక్ష సమావేశం
- హాజరు కానున్న మంత్రి పొన్నం ప్రభాకర్




జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో రమేష్

భీమదేవరపల్లి, జనవరి 3: కొత్తకొండ వీరభద్రస్వామి జాతర అభివృద్ధిపై ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్వామివారి ఆలన పాలన, అభివృద్ధి ప్రభుత్వం చూడాల్సి ఉండగా, కేవలం భక్తుల సహకారంతోనే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. లక్షలాది మంది భక్తులు నిత్యం స్వామివారని దర్శించుకోవడానికి వస్తున్నా.. వారికి తగిన సౌకర్యాలు కల్పించడంలో మాత్రం ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారే తప్ప పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయం హనుమకొండ జిల్లా పరిధిలోకి వచ్చిన తర్వాత దర్శనానికి వచ్చే భక్తులు సంఖ్య కూడా పెద్దఎత్తున పెరిగింది. కానీ వచ్చే భక్తులకు సరిపడా ఏర్పాట్లు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చేపట్టాల్సిన అభివృద్ధి పనులు...

కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయంలో కొండపైకి ఘాట్ రోడ్ నిర్మాణం, ఆలయం చుట్టూ పచ్చదనం ఏర్పాటు చేసేందుకు గ్రీనరీ, ఆలయ ప్రాంగణం మొత్తం సీసీ రోడ్ల నిర్మాణం, వీఐపీల కోసం గెస్ట్‌హౌజ్ నిర్మాణం, అన్నదానం కోసం భోజనశాల ఏర్పాటు, మహిళల కోసం స్నానాల ఘట్టం, అద్దాల మండపం, సెంట్రల్ లైటింగ్ సిస్టం, ఆలయం చుట్టూ అర్చిగేట్ల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు చేస్తే వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందని పలువురు తెలుపుతున్నారు. కొత్తకొండ దేవాలయానికి చెందిన ఎకరం భూమిలో 2017లో ప్రభుత్వం హరిత హోటల్ ను నిర్మించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు దానికి సంబంధించిన లీజ్ డబ్బులు మాత్రం దేవాలయానికి ఇవ్వడం లేదు. పైగా బ్రహ్మోత్సవాల సందర్భంగా వీఐపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరైనా వస్తే వారికి కేటాయించిన రూమ్‌ల బిల్లులు మాత్రం దేవాలయం చెల్లించాలని అధికారులు పేర్కొంటున్నారు.

నేడు మంత్రి సమీక్ష సమావేశం

కొత్తకొండ జాతర బ్రహ్మోత్సవాల సమీక్ష సమావేశాన్ని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు వివిధ శాఖాల అధికారులు పాల్గొననున్నారు. జాతర అభివృద్ధిపై కూడా ఈ సమావేశంలో మాట్లాడనున్నారు. అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నివేదికలు సమర్పించేందుకు భక్తులు, అధికారులు సమాయత్తమవుతున్నారు. సమావేశానికి ఏర్పాట్లను హనుమకొండ ఆర్డీవో ఎల్ రమేష్‌తో పాటు దేవాలయ ఈవో కిషన్‌రావులను పరిశీలించారు.

రాజన్న సేవలో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

వేములవాడ, జనవరి 3: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించారు. ఆలయ ప్రొటోకాల్ సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు స్వామివారి ప్రసాదం అందజేశారు.


ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌కు ప్రసాదం అందజేస్తున్న సూపరింటెండెంట్ శ్రీరాములు

మేదరి సంఘం మహిళా నేతకు ఘన సత్కారం


దీకొండ సరితకు షీల్డ్‌ను బహుకరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

వడ్డెపల్లి, జనవరి 3: తెలంగాణ బీసీ జన జాగృతి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో జ్యోతిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విద్య, రాజకీయ, సాంస్కృతిక, సమాజ సేవ, మహిళా అభ్యున్నతి, మహిళా జాగృతి విభాగాల్లో ప్రతిభ కనబర్చిన బీసీ కులాల మహిళలను కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లా మేదరి కుల ప్రతినిధులుగా కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ కనబర్చిన దీకొండ సరిత, చందా స్వరాజ్యంలకు షీల్డులను బహూకరించి అభినందించారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ వకుళా భరణం కృష్ణమోహన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి. హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌పై గురి



- బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు వల వేస్తున్న కాంగ్రెస్
- బీజేపీ కార్పొరేటర్లకు సైతం టచ్‌లోకి...
- మే నాటికి అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధం
- ముందుగానే బీఆర్‌ఎస్‌ను ఒంటరిని చేయాలనే వ్యూహాలు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 3 : వరంగల్ మహానగర పాలక సంస్థపై కాంగ్రెస్ గురి పెట్టింది. అవిశ్వాస తీర్మానం పావుగా హస్తం పార్టీ అస్త్రాలను సంధిస్తోంది. బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు వల వేసి ఆ పార్టీని బల్దియాలో ఒంటరిని చేయాలనే ప్రణాళికలతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇతర ముఖ్య నేతలు వ్యూహాలు పన్నుతున్నారు. ఇందులో భాగంగా బీఆర్‌ఎస్‌కు చెందిన ఆరుగురు కార్పొరేటర్లను కాంగ్రెస్ వైపు తిప్పేసుకున్నారు. రానున్న మే నాటి వరకు బల్దియా ప్రస్తుత పాలక వర్గానికి మూడేళ్లు పూర్త అవుతాయి. అప్పటి వరకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి కూల్చి వేయని పరిస్థితి. ఈ క్రమంలో ఇప్పటి నుంచే బీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీ కార్పొరేటర్లను తమ వైపునకు లాగి బలాన్ని పెంచుకోవాలనే దిశగా కాంగ్రెస్ నేతలు అడుగులు వేస్తున్నారు. ఈ పరిణామాలతో బీఆర్‌ఎస్ కూడా తమ వారిని దక్కించుకునే దిశగా యత్నాలు చేపట్టింది.

చేరికలతో కాంగ్రెస్‌కు పెరిగిన బలం

బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల చేరికలతో బల్దియాలో కాంగ్రెస్ కార్పొరేటర్ల బలం 11కు చేరింది. కాంగ్రెస్ కార్పొరేటర్లు తోట వెంకన్న, పోతుల శ్రీమాన్, జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీలు ఉన్నారు. కొద్ది రోజుల క్రితమే బీఆర్‌ఎస్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ కాంగ్రెస్ కండువా కప్పేసుకున్నారు. తాజాగా బుధవారం కాంగ్రెస్‌లో చేరిన ఆరుగురు కార్పొరేటర్లతో మొత్తం కాంగ్రెస్ బలం బల్దియాలో 11కు పెరిగింది. టెక్నికల్‌గా బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల చేరికలు ఆమోదం కావు కానీ వీరంతా బీఆర్‌ఎస్ పాలక వర్గం ప్రవేశపెట్టే తీర్మాణాలు, నిర్ణయాలను వ్యతిరేకిస్తూ విపక్షంగా వ్యవహరిస్తారు. మున్ముందు కూడా మరి కొందరు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరనున్నారనే సంకేతాల క్రమంలో బల్దియాలో కాంగ్రెస్ సంఖ్య మరింత పెరిగి బీఆర్‌ఎస్‌పై ఆధిపత్యం చెలాయించే పరిణామాలు దారి తీస్తాయనే చర్చ జరుగుతోంది.

మే నాటికే అవిశ్వాస తీర్మానం

బల్దియాలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ చేసే యత్నాలు ఇప్పుడు ఫలించని పరిస్థితి. మే వరకు బీఆర్‌ఎస్ పాలకవర్గానికి మూడేళ్లు పూర్తి కానున్నాయి. నిబంధనల మేరకు మూడేళ్ల తరువాతే అవిశ్వాస తీర్మానానికి అవకాశం ఉండడంతో కాంగ్రెస్ ఇప్పటికిప్పుడే కూల్చేయలేదనే ధీమాతో బీఆర్‌ఎస్ నేతలు ఉన్నారు. ఇక మే నెలలో అవిశ్వాస తీర్మానం కాంగ్రెస్ నెగ్గాలన్నా ఆ పార్టీకి తగిన బలం సమకూరాల్సి ఉంది. ప్రస్తుతం బల్దియాలో 66 మంది కార్పొరేటర్లు ఉన్నారు. బీఆర్‌ఎస్ బలం 52 కార్పొరేటర్లతో ఉండేది. చేరికల క్రమంలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల సంఖ్య 45కు తగ్గింది. ఎక్స్ అఫిషియో సభ్యులైన ఎంపీలు పసునూరి దయాకర్, డాక్టర్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి బాధ్యత తీసుకుంటే కలిపి మొత్తంగా 49 బీఆర్‌ఎస్ బలంగా ఉంది. కాంగ్రెస్‌కు 11 మంది కార్పొరేటర్లు ఉండగా ఎక్స్ అఫిషియో సభ్యులు మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డితో కలిపి మొత్తంగా ఇప్పటికిప్పుడు 15 మంది ఉంటారు. అయితే ఎక్స్ అఫిషియోగా కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో రేవూరి, నాగరాజు పరకాల, వర్ధన్నపేట మునిసిపాలిటీల్లో బాధ్యత తీసుకుంటారో లేదో తేలాల్సి ఉంది. ఒకవేళ జీడబ్ల్యూఎంసీలోనే సభ్యులుగా ఉంటే మాత్రం కాంగ్రెస్ బలం ఇప్పటికిప్పుడు 15గా ఉన్నట్లే. అవిశ్వాస తీర్మానం కాంగ్రెస్ ప్రవేశపెట్టి నెగ్గాలంటే ఆ పార్టీకి ఎక్స్ అఫిషియోల సంఖ్యతో కాకుండా మరో 19 మంది కార్పొరేటర్ల బలం కావాల్సి ఉంది. ఈ క్రమంలో బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి కార్పొరేటర్లను కాంగ్రెస్‌లోకి చేర్పించే వ్యూహంతో కాంగ్రెస్ నేతలు పావులు కదుపుతున్నారు. ఒకవేళ బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల సంఖ్య తగ్గినా బీజేపీ కార్పొరేటర్లు మాత్రం కాంగ్రెస్ పక్షాన ఓటెయ్యడం కుదరదనే అంచనాలు ఉన్నాయి. ఈ క్రమంలో తమకు ఎలాంటి ఢోకా ఉండదని, కాంగ్రెస్‌కు బలాన్నే చేకూర్చే అంత సంఖ్యలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లను కాపాడుకోవాలనే ప్రతి వ్యూహంతో బీఆర్‌ఎస్ అస్త్రాలను సిద్ధం చేసుకుంటోంది. మొత్తంగా ఆరు నెలల కౌంట్ డౌన్‌తో గ్రేటర్ రాజకీయాలు రసవత్తరం కానున్నాయి.

ముఖ్యమంత్రి ఓఎస్డీగా ముల్కనూరు వాసి



వేముల శ్రీనివాసులు

భీమదేవరపల్లి, జనవరి 3: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓఎస్డీగా ముల్కనూరుకు చెందిన వేముల శ్రీనివాసులును నియమిస్తూ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో ముల్కనూరులో ఆయన మిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏడు సంవత్సరాలుగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ జాయింట్ ఐజీగా శ్రీనివాసులు పని చేశారు. ముల్కనూరులో నిరుద్యోగ యువతకు ఉచితంగా కోచింగ్, స్టడీ మెటీరియల్ అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రజా గ్రంథాలయ ఏర్పాటులో శ్రీనివాసులుది కీలకపాత్ర. ఆయన ఓఎస్డీగా ఎన్నిక కావడంతో జడ్పీటీసీ వంగ రవి, ముల్కనూరు సర్పంచ్ మాడుగుల కొమురయ్య పల్లా ప్రమోద్‌రెడ్డి, అరుణ్ కుమార్, లక్ష్మయ్య, వీరేశం తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యోగుల వేతనాలు వెంటనే విడుదల చేయాలి

హనుమకొండ రూరల్, జనవరి 3: సమగ్ర శిక్ష, కేజీబీవీ ఉద్యోగుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సదాశివరెడ్డి, పెండెం రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత రెండు నెలలుగా వేతనాలు అందక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నూతన ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల ఒకటవ తేదీన వేతనాలు విడుదల చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అందించాలి



జూనియర్ అసిస్టెంట్ భగవాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

ఇనుగుర్తి, జనవరి 3 : తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అందించాలని, ప్రభుత్వం ప్రకటించిన 250 గజాల ఇంటిస్థలం ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారులు పింగిలి శ్రీనివాస్, ప్రభుత్వాన్ని కోరారు. ఇనుగుర్తి తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జూనియర్ అసిస్టెంట్ భగవాన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమం కోసం పనిచేసిన అమరవీరులకు, ఉద్యమకారులకు ఇండ్ల స్థలం, పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూర రఘుపతి, సట్ల బిక్షపతి, లింగ్యానాయక్, హనుమాండ్ల సోమిరెడ్డి, జంపయ్య, గండు నాగన్న పాల్గొన్నారు.

ఆదిత్య ఆస్పత్రి వ్యవస్థాపకుడి మృతి



డాక్టర్ కృష్ణారెడ్డి (ఫైల్)

హనుమకొండ అర్బన్, జనవరి 3 : హనుమకొండలోని ఆదిత్య ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ చింతలపాణి కృష్ణారెడ్డి (74) బుధవారం సాయంత్రం అనారోగ్యంతో హనుమకొండలోని ఇంటిలో మృతి చెందారు. కాజీపేట సమీపంలోని సూర్యకుటీర్ వెంచర్‌లో గురువారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి వైద్య పట్టా పొంది రోగులకు వైద్య సేవలందించారు. హుస్నాబాద్ మండల కేంద్రంలో మూడు దశాబ్దాల పాటు వైద్య సేవలు అందించారు. ఆయనకు రాకేశ్‌రెడ్డి, వరుణ్‌రెడ్డి ఇద్దరు కుమారులు ఉన్నారు. కృష్ణారెడ్డి మృతి పట్ల పలువురు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు సంతాపం ప్రకటించారు.

అర్చక ఉద్యోగుల సమస్యలు తీర్చాలి

ఉప ముఖ్యమంత్రి భట్టికి విజ్ఞప్తి



ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన ప్రధాన దేవాలయాల అర్చక ఉద్యోగులు

హనుమకొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని అర్చక ఉద్యోగులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కోరారు. బుధవారం తెలంగాణ అర్చక ఉద్యోగుల జాక్ ఆధ్వర్యంలో ప్రధాన దేవాలయాల అర్చకులు ఉప ముఖ్యమంత్రిని హైదరాబాద్‌లో జ్యోతిరావుపూలే ప్రజాభవన్‌లో కలిశారు. అర్చక, ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలోని 12,625 దేవాలయాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో అన్యాక్రాంతం అయిన 36వేల ఎకరాల ఆలయ భూములను భూకబ్జాదారుల నుంచి విడిపించి వేలం పాట ద్వారా అమ్మి తద్వారా వచ్చే అదాయంతో ఆలయాలను అభివృద్ధి చేయాలని కోరారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద జీవో 577 ప్రకారం మిగిలిన 2వేల మంది అర్చక ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చిన విధంగా దూప దీప నైవేద్యం అర్చకులకు నెలకు రూ.12 వేలు ఇప్పించాలని కోరారు. భట్టి విక్రమార్క ఇందుకు సానుకూలంగా స్పందించారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొండగట్టు, వేములవాడ, కాళేశ్వరం, బాసర, భద్రాచలం, యాదాద్రి, కొమురవెల్లి తదితర దేవాలయాల అర్చకులు, వేద పండితులతో పాటు దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కురాకుల జ్యోతి ఈవోల సంఘం ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ అర్చక, ఉద్యోగుల జాక్ చైర్మెన్ గంగు ఉపేంద్ర శర్మ, రాష్ట్ర దేవాలయాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కొండూరి క్రిష్ణమాచారి, అధ్యక్షుడు భద్రీనారాయణాచార్యులు డీడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నిట్టూరి సతీష్ శర్మ వరంగల్ అధ్యక్షుడు పెన్నా మోహన్ శర్మ తదితరులు ఉప ముఖ్యమంత్రిని కలిసినవారిలో ఉన్నారు. అర్చకులు భట్టి విక్రమార్కకు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి సత్కరించారు.

ఆటో డ్రైవర్ల భిక్షాటన



హనుమకొండ చౌరస్తాలో భిక్షాటన చేస్తూ ర్యాలీగా వెళ్తున్న ఆటో కార్మికులు

హనుమకొండ స్పోర్ట్స్, జనవరి 3 : మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రవేశపెట్టడంతో ఉపాధి కోల్పోయామని ఆటో డ్రైవర్‌లు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. బుధవారం హనుమకొండ వేయి స్తంభాల ఆలయం నుంచి ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు ఇసంపెల్లి సంజీవ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు హనుమకొండ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం సంజీవ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో తాము జీవనోపాధి కోల్పోయి కుటుంబాలతో పాటు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకుని నెలకు రూ. 15000 జీవన భృతి అందించాలన్నారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆటో కార్మికులు ఐక్యంగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడంతో పాటు ఉద్యమాలు, ధర్నాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు మడికొండ బాబు, కలకోట్ల జయరాం, పసునూరి బాబు, మంద శ్రీధర్‌రెడ్డి, కుమార్, బొల్లం సంజీవ, గుండా రమేష్, సాయిలు, శ్రీనివాస్, ఖాజాపాషా, మామాక్, రాజు, హైమద్, పద్మరావు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు



ఎమ్మెల్యే నాగరాజుకు వినతి పత్రం ఇస్తున్న గోపాల్‌పూర్ గీత కార్మికులు

వడ్డెపల్లి, జనవరి 3 : గీత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. బుధవారం హనుమకొండ సుబేదారి ప్రాంతంలోని ఎమ్మెల్యే నివాసంలో గోపాల్‌పూర్ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు చింత రమేష్ గౌడ్, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు దూలం క్రాంతి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని ఊర చెరువు ప్రాంతంలోని సుమారు వెయ్యి గజాల ప్రభుత్వ స్థలాన్ని గత వంద సంవత్సరాలుగా గోపాల్‌పూర్ గీత కార్మికులు శ్మశాన వాటిక కోసం వాడుకుంటూ దహన సంస్కారాలను నిర్వహిస్తున్నారన్నారు. ఏడాది కాలంగా తాము వాడుకుంటున్న శ్మశాన వాటిక స్థలాన్ని సీపీఎం నేతల ప్రోద్బలంతో కొందరు గుడిసెలు వేశారని తెలిపారు. గతంలో ఇదే స్థలంలో గుడిసెలు వేసుకోగా పోలీసుల సహకారంతో రెవెన్యూ అధికారులు తొలగించారని మళ్లీ ఇదే స్థలంలో గుడిసెలు వేసి తమ శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. గోపాల్‌పూర్ గీత కార్మికులకు కేటాయించిన శ్మశాన వాటిక స్థలాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే నాగరాజుకు ఇచ్చిన పత్రంలో కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో గోపాల్‌పూర్ మాజీ ఎంపీటీసీ దూలం రఘుపతిగౌడ్, మాజీ సర్పంచ్ దూలం సదానందం గౌడ్, గీత కార్మిక సంఘం నేతలు వల్లాల రాజ్‌కుమార్ గౌడ్, మాజీ డీసీపీ సుదర్శన్‌గౌడ్, అనిల్‌గౌడ్, శ్రీనివాస్, కార్తీక్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకం

ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్



నేరడ మోడల్‌స్కూల్లో మాట్లాడుతున్న డాక్టర్ పరికిపండ్ల అశోక్

కురవి, జనవరి 3 : విద్యతోనే సమాజంలో గౌరవం, ముందడుగు సాధ్యమని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. కురవి మండలం నేరడ మోడల్‌స్కూల్లో బుధవారం ప్రేరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల కోసం ఉచిత ప్రేరణ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించాలంటే కష్టించి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అరుణ, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, షేక్.జానీ, కొండబత్తుల ఈశ్వర్, ప్రసాద్, కొండబత్తుల యాదగిరి, ఉపాధ్యాయులు వెంకటకృష్ణ, రజిత, రాంనర్సయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

మరిపెడ, జనవరి 3 : మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని నర్సింహులపేట ఎస్సీ బాలికల గురుకుల ప్రవేశాలకు 4వ తరగతి పాసైన విద్యార్థినుల నుంచి 5వ తరగతి ప్రవేశం కోసం ఆన్‌లైన్లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ గురుకుల ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 6వ తేదీలోపు అర్హులైన విద్యార్థినులు రూ.100 రుసుం చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని నిరుపేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కుమారుడితో వెళ్లిన మహిళ అదృశ్యం

మహబూబాబాద్ రూరల్, జనవరి 3 : మహబూబాబాద్ మండలంలోని కొత్త రెడ్యాల గ్రామానికి చెందిన భార్య మేకల అనిత కుమారుడు హర్షవర్ధన్ గత ఐదు రోజుల నుంచి కన్పించడం లేదని భర్త మేకల మల్లయ్య ఫిర్యాదు చేసినట్లు రూరల్ ఎస్సై దీపికరెడ్డి బుధవారం తెలిపారు. మల్లయ్య డిసెంబర్ 30న పక్క గ్రామమైన నర్సింహులగూడెంలో బంధువుల ఇంటికి శుభ కార్యక్రమానికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి తన భార్య అనిత, తమ ఏడేళ్ల కుమారుడు కన్పించకపోవడంతో బంధువుల ఇళ్లలో వాకబు చేసినట్లు చెప్పారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా రాజేష్



రాజేష్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న నరేందర్

గీసుగొండ, జనవరి 3: తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా 15వ డివిజన్ మొగిలిచర్ల గ్రామానికి చెందిన బరుపటి రాజేష్ ఎంపికయ్యారు. ఈ మేరకు రాకేష్‌కు నియామక పత్రాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ హైదరాబాద్‌లో బుధవారం అందజేశారు. కాగా, తన ఎంపికకు సహకరించిన గీసుగొండ ఎంపీపీ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు భీమగాని సౌజన్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పత్తిపాక తిరుపతి, బిల్లా రాజేష్, చింతం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాపువాడలో చోరీ

రూ. 3 లక్షల విలువైన ఆభరణాల అపహరణ

హనుమకొండ క్రైం, జనవరి 3 : హనుమకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని కాపువాడలో దొంగలు హల్‌చల్ చేశారు. ఓ తాళం వేసిన ఇంట్లో చొరబడి అందిన కాడికి దోచుకెళ్లారు. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాపువాడకు చెందిన బొల్లం వీరభద్రస్వామి రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడ, కొండగట్టుకు విహార యాత్రకు వెళ్లాడు. తిరిగి మంగళవారం రాత్రి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి ఉంది. బీరువాతో వెతికి చూడగా బంగారం, వెండితో పాటు విలువైన వస్తువులు కనిపించకుండా పోయాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్లూస్ టీం, సీసీఎస్ పోలీసులు అక్కడకు చేరుకుని ఆధారాలు సేకరించారు. హనుమ కొండ పోలీసులు బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించారు. సుమారు రూ. 3 లక్షల విలువైన సొత్తు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్టు పోలీసులు నిర్ధారించారు. నిందితుల కోసం గాలిస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.



మానుకోటలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల సదస్సులో మాట్లాడుతున్న బీమ్లానాయక్


మహబూబాబాద్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న కాళోజీ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు


డోర్నకల్ మైనార్టీలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నేతలు


జమాండ్లపల్లి పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి సభలో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

జిల్లాలో సావిత్రిబాయి పూలే జయంతి

మహబూబాబాద్ టౌన్, జనవరి 3 : జిల్లా వ్యాప్తంగా బుధవారం మహనీయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని జమాండ్లపల్లి పాఠశాలలో గిరిజన సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు, పీఎస్‌హెచ్‌ఎం గుగులోతు కిషన్‌నాయక్ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఆమెకు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన మానుకోట డీఎస్పీ తీర్థాల సత్యనారాయణ మాట్లాడుతూ సావిత్రిబాయిపూలేను ఆదర్శంగా తీసుకుని మహిళలు ముందుకు సాగాలని కోరారు. నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రావు, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు సమ్మెట వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ బండి ఇందిర, ఉపాధ్యాయులు సైదులు రెడ్డి, బ్రహ్మం, శ్యాంప్రసాద్, శివానీ చాంప్లా, ఎస్ఎంసీ చైర్మన్ సైదులు, రోజారాణి, సరిత, మంజుల, మహేశ్వర్, ప్రభావతి పాల్గొన్నారు.

• మహబూబాబాద్ పట్టణంలో మా అసోసియేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సబ్ రిజిస్ట్రార్ తస్లీమామహ్మద్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు దార ఇందు భారతినుసన్మానించారు. మునిసిపల్ వైస్ చైర్మన్ ఎమ్డీ. ఫరీద్, మా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డుపల్లి ఉపేంద్రం, మందుల రఘు, బొడ్డుపల్లి కొమురమ్మ, నిమ్మల శ్రీనివాస్, కామ సంజీవరావు, చుక్కల ఉదయ్‌చందర్, ఘనపురపు అంజయ్య, ఇమాముద్దీన్, శ్రీనివాస్, రామకృష్ణ, సుధాకర్, యుగేందర్, శివకుమార్ పాల్గొన్నారు.

• పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి, అల్వాల వీరయ్య, కుర్ర మహేష్, మందుల మహేందర్, చీపిరి యాకయ్య, సాయికుమార్, బానోత్ వెంకన్న, లక్ష్మణ్, జానీ తదితరులు పాల్గొన్నారు.

• భగత్ స్టడీ సెంటర్‌లో ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో అధ్యక్షుడు కళ్లెం వీరారెడ్డి, సోమ గోవర్ధన్, కొమిరె ఉప్పలయ్య, సోమ సైదులు రెడ్డి, గొర్రె శ్రీనివాస్, కాపరబోయిన శ్రీనివాస్, పూసపాటి నాగముణి పాల్గొన్నారు.

• దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో జిల్లా కార్యదర్శి వంకాయలపాటి చిరంజీవి, పుచ్చకాయల సుధాకర్, బీర్రు వెంకట్‌లక్ష్మి, దివ్య భారతి, పుష్ప, భూలక్ష్మి, మమత, భారతమ్మ, సుగణ, శిరీష పాల్గొన్నారు.

• టీపీటీఎఫ్ జిల్లా భవన్‌లో సావిత్రి బాయి పూలే విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం, పులిచింతల విష్ణువర్ధన్‌రెడ్డి, బలాష్టి రమేష్, బొల్లం శ్రీనివాస్, సోమ విష్ణువర్ధన్, చీకటి ఉపేందర్, సువర్ణ, రాచకొండ ఉపేందర్, విద్యాసాగర్, శ్రీనివాస్, సామ సత్యం, యాకయ్య గోవర్ధన్, మంజు భార్గవి పాల్గొన్నారు.

• మహబూబాబాద్ మండలం అమనగల్‌లో పాఠశాలలో జరిగిన వేడుకలో హెచ్‌ఎం. వెంకట్‌రెడ్డి, దేశబోయిన వెంకన్న, శశిధర్, పి.జనార్ధన్, రమేష, బాలాజీ, యుగేందర్, ఎం. శ్రీనివాస్, రామాచారి, అరుణ, షమీం, హైమా, జ్యోతి పాల్గొన్నారు.

• నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజు, రామరత్నమాల, బి.వెంకటేశ్వర్లు, బొందాలు, యుగేందర్, మల్లేశం, శివజ్యోతి, కమాలకర్, సుదర్శన్ పాల్గొన్నారు.

• ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, బామ్‌సేఫ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో ప్రిన్సిపాల్ పి. సదానందం, డీఐఈవో సత్యనారాయణ, బానోత్ బీమ్లానాయక్, సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్, మునిసిపల్ వైస్ చైర్మన్ ఫరీద్, ఘైన శ్రీనివాస్, పిల్లి సుధాకర్,భూక్య వీరన్న, నాయిని వీరేందర్ పాల్గొన్నారు.

• కంబాలపల్లి, పర్వతగిరి పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఆయాకార్యక్రమాల్లో పి.లింగ మూర్తి, సుమీలారాణి, గీత, భాగ్య, మెర్సి, రాధిక పాల్గొన్నారు.

• ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సావిత్రి బాయిపూలే జయంతిని పురస్కరించుకుని మహిళా అధ్యాపకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మానుకోట ఆర్డీవో అలివేలు, డీఎస్పీ తీర్థాల సత్యనారాయణ, కామ సంజీవరావు, ఘనపురపు అంజయ్య, బొడ్డుపల్లి ఉపేంద్రం, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి, తప్పెట్ల వీరన్న, ప్రిన్సిపాల్ క్రాంతిజ్యోతి పాల్గొన్నారు.

• సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

• ఎన్టీఆర్ స్టేడియంలో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ వేడుకల్లో మహిళలు సునీత, డాక్టర్ మండల ప్రత్యూష, బుజ్జిలను సన్మానించారు. ఇంటలిజెన్స్ డీఎస్పీ మోహన్, డాక్టర్ జోలి సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, లక్ష్మయ్య, నాగయ్య, జానీ, విష్ణువర్ధన్, హట్యానాయక్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

డోర్నకల్ మైనార్టీ పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రిజ్వాన, అబ్దుల్ అజీజ్, శివప్రసాద్, నామ వెంకటేశ్వర్లు, వివేక్, కేజీబీవీ ప్రిన్సిపల్ మున్నీ, ఎస్.శ్రీనివాస్, అమీనా, గ్రేసమ్మ, రేణుక, అనూష, రాములు, ప్రసాద్, వరలక్ష్మి పాల్గొన్నారు.

• నర్సింహులపేటలోని హైస్కూల్, మోడల్‌స్కూల్, పెద్ద నాగారం హైస్కూల్, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల్లో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ వివేక్, ఎంపీడీవో భారతి, ప్రిన్సిపాల్ ఆనందబాబు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• కేసముద్రం విలేజ్ శ్రీవివేకావర్ధిని హైస్కూల్‌లో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్, ప్రిన్సిపల్ చిర్ర నరేష్, పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కల్వల హైస్కూల్లో మహిళా ఉపాధ్యాయులను హెచ్‌ఎం నరేందర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

• బయ్యారం ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు సావిత్రి బాయిపూలే చిత్రపటానికి పూలమాలలతో నివాళ్లర్పించగా అధ్యాపక బృందం కోటేష్, సంతోష్, శ్రీధర్‌సింగ్ పాల్గొన్నారు. దీంతో పాటు పలు పాఠశాలల్లో సైతం ఉపాధ్యాయులు సావిత్రి బాయిపూలే జయంతి వేడుకలు నిర్వహించారు.

• కొత్తగూడ మండలం పొగుళ్లపల్లి జడ్పీహెచ్ఎస్‌లో సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకుని మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రావు, రాణి, బేబీ, పుష్పలీల, భాస్కర్, సుమన్, సుధాకర్, నర్సయ్య, జమ్ములాల్, రాంబాబు, కొంరయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

• గార్ల బస్టాండ్ సెంటర్‌లో జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలకు పలువురు పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో తాళ్లపల్లి కృష్ణగౌడ్, ఎంపీటీసీ మాలోతు వెంకట్‌లాల్, వీరస్వామి, సాగర్, రమేష్, పృథ్వీ నాయక్, రవినాయక్, మాగం లోకేష్ పాల్గొన్నారు.

• తొర్రూరు : సావిత్రి బాయి పూలే గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడుతూ పూలే జయంతి వేడుకలు తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బస్టాండ్ సెంటర్‌లో ఆమె చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, జూనియర్, డిగ్రీ కళాశాల, బీజేపీ తొర్రూరు మండల శాఖ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో, టీపీటీఎఫ్, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను శాలువా, మెమెంటోలతో సత్కరించారు.

• మరిపెడ రూరల్ : గాలివారిగూడెం పీఎస్‌లో సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వెంకన్న ఫైజోద్దీన్, బాలు, లింగాల మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మంగపేట ఎంపీడీవో మృతి


శ్రీధర్ (ఫైల్)

మంగపేట (ములుగు జిల్లా), జనవరి 3 : మంగపేట ఎంపీడీవో కర్నాటి శ్రీధర్ (57) మృతి చెందారు. రెండు రోజుల క్రితం ప్రజాపాలనలో విధుల్లో ఉండగానే అస్వస్థతకు గురైన ఆయన చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యారు. బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి ఎంపీడీవో శ్రీధర్ హాజరవుతున్నారు. డిసెంబరు 30న మండలంలోని కత్తిగూడెంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఒక్కసారిగా ఆయన అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను ఉద్యోగులు ఇంటికి చేర్చారు. ఇదే క్రమంలో 31న ఒళ్లు నొప్పులతోపాటు తీవ్ర జ్వరం రావడంతో మాజీ ఎంపీటీసీ మండవ రామకృష్ణ ఆయన్ను ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం ములుగులోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ మూడు రోజుల పాటు వైద్యం పొంది డిశ్చార్జ్ అయిన ఎంపీడీవో బుధవారం తెల్లవారుజామున బాత్‌రూంలోఒక్కసారిగా కుప్పకూలిపోయారు. గుండెనొప్పి వచ్చి తుదిశ్వాస విడిచారు. ఖమ్మం జిల్లా మధిరకు చెందిన శ్రీధర్‌మంగపేట ఎంపీడీవోగా కొనసాగుతున్నారు. గతంలో వెంకటాపూర్ (రామప్ప)ఎంపీడీవోగాపనిచేశారు. ఆయనకు భార్య గీత, కూతురు ప్రియాంక ఉన్నారు. మంగపేటలోని అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. కూతురు అమెరికాలో భర్త, ఇద్దరు పిల్లలతో ఉంటున్నారు. శ్రీధర్ మృతదేహాన్ని బంధువులు మధిరకు తరలించారు. కూతురు అమెరికా నుంచి రాగానే అక్కడే అంత్యక్రియలు జరగనున్నాయి. ఎంపీడీవో మృతిపట్ల మంత్రి సీతక్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

డోర్నకల్‌లో వాలీబాల్ పోటీలు

డోర్నకల్, జనవరి 3 : డోర్నకల్ ఫ్రెండ్స్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీహైస్కూల్ గ్రౌండ్స్‌లో రెండ్రోజుల పాటు జరిగే డోర్నకల్ మండలస్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు డోర్నకల్ ఫ్రెండ్స్ సంస్థ అధ్యక్షుడు శీలం శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు వాలీబాల్ పోటీలను బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో మొత్తం 10 జట్లు పాల్గొంటాయని చెప్పారు. ప్రథమ బహుమతికి రూ. 5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలతో పాటు క్రీడాకారులకు ఉచితంగా టీషర్టులు, క్రీడాసామగ్రి అందించనున్నట్లు పేర్కొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో అన్నదానం

కేసముద్రం, జనవరి 3 : కేసముద్రం జ్యోతిబాపూలే సెంటర్‌లో బుధవారం లయన్స్‌క్లబ్ పూర్వ అధ్యక్షుడు బోగోజు నాగేశ్వరాచారి పుట్టినరోజు సందర్భంగా అన్నదానాన్ని చేశారు. క్లబ్‌చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ కటకం చంద్రశేఖర్, పాస్ట్ జడ్‌సీ యర్రం శ్రీరాములు, రాపాక కుమారస్వామి, రుద్ర శ్రీకాంత్, మడిపెద్ది వెంకటేష్ పాల్గొన్నారు.

కేటీఆర్, హరీశ్‌రావులను కలిసిన ఎంపీ కవిత


కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ కవిత

మహబూబాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాష్ట్ర మాజీమంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్‌కుమార్‌ను బుధవారం మానుకోట పార్లమెంట్ సభ్యురాలు మాలోతు కవిత మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎంపీకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధురాలు మృతి

గూడూరు, జనవరి 3 :గూడూరు మండలం మట్టేవాడలో మంగళవారం రాత్రి స్వాతంత్ర్య సమరయోధురాలు యాసారపు సావిత్రమ్మ (96) అనారోగ్యంతో మృతి చెందారు. రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో సావిత్రమ్మ కీలకపాత్ర పోషించారు. అప్పటి ప్రభుత్వం ఆమె పోరాటాన్ని గుర్తించి స్వాతంత్ర్య సమరయోధురాలుగా గుర్తించారు. మృతురాలికి కుమారుడు వెంకట్రాంనర్సయ్య ఉన్నారు.


'పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తాం'

మహబూబాబాద్ రూరల్, జనవరి 3 : సంక్షేమ ఫలాలను అర్హులైన పేద ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. కంబాలపల్లిలో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని, దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్‌కార్డులు, పింఛన్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఏ ఒక్కరికి కూడా ఇవ్వలేదని చెప్పారు. సర్పంచులు సంద వీరన్న, మేడి శారదవెంకన్న, పూజారి మంగమ్మవెంకన్న, ఎంపీటీసీ మంగీలాల్, ఉపసర్పంచ్ చీరిక వేణురెడ్డి, గ్రామపార్టీ అధ్యక్షులు చీరిక ఉపేందర్‌రెడ్డి, మాజీఎంపీటీసీ శ్రీనివాస్, నోడల్ ఆఫీసర్ సూర్యనారాయణ, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో హరిప్రసాద్, పీఆర్ఏఈ రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, ఏపీఎం తిలక్, సీసీ సుమలత పాల్గొన్నారు.

● గూడూరు : పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మట్టేవాడలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఐదు గ్యారెంటీల ద్వారా సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. జడ్పీ కోఆప్షన్ ఖాసీం, సర్పంచ్ ఈసం సంధ్య సూర్యనారాయణ, జిల్లా హార్టికల్చర్ అధికారి సూర్యనారాయణ, ఎంపీడీవో రోజారాణి, తహసీల్దార్ అశోక్‌కుమార్, సీఐ ఫణిదర్, ఎస్సై రాణాప్రతాప్ పాల్గొన్నారు.

● నెల్లికుదురు : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ తెలిపారు. నెల్లికుదురు మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీలతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. రూ.10లక్షల ఆరోగ్యశ్రీ మహిళలు ఉచిత బస్సు సౌకర్యంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకుండా ప్రజలను మభ్యపెట్టిందన్నారు. రేషన్ కార్డులేని ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతీ ఒక్కరి దరఖాస్తులు అధికారులు తీసుకుంటారన్నారు. ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, వైస్‌ఎంపీపీ జెల్ల వెంకటేష్, సర్పంచ్ బీరవెల్లి యాదగిరిరెడ్డి, ఎంపీటీసీ వెన్నాకుల వాణిశ్రీ నివాస్, కో-ఆప్షన్ సభ్యుడు రహీమాన్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి సూర్యనారాయణ, మండల ప్రత్యేకాధికారి రామారావు, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో శేషాద్రి, ఏవో నెలకుర్తి రవీందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


నెల్లికుదురులో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్న మురళీనాయక్



ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ

నెల్లికుదురు, జనవరి 3 : మండలంలోని రత్తిరాంతండాలో బుధవారం అంజేయ స్వామి విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. తండావాసులు నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆంజేయ స్వామి విగ్రహన్ని ప్రతిష్ఠించి వేద పండితుల సమక్షంలో హోమం, కుంకుమార్చన, కార్యక్రమాలు నిర్వహించి కొబ్బరికాయలు, పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ బిక్కునాయక్, ఎంపీటీసీ గుగులోత్ మదన్‌లాల్, తండావాసులు పాల్గొన్నారు.

రామన్నగూడెంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన


ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న గ్రామస్థులు

నెల్లికుదురు, జనవరి 3 : మండలంలోని రామన్నగూడెం గ్రామంలో శ్రీఆంజనేయస్వామి ఆలయం ముందు బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంజేయస్వామి విగ్రహన్ని గ్రామంలో ఊరేంగించి, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గ్రామస్థులు కొబ్బరికాయలు మంగళహారతులతో మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాశమల్ల పద్మ, ఎంపీటీసీ పెరమాండ్ల సుమలత, ఉప సర్పంచ్ కాసం లక్ష్మారెడ్డి, గ్రామస్థులు కాసం రంజిత్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్‌రెడ్డి, రావుల సతీష్, పాశం రమేష్, కనకం మహేందర్, ఆకుతోటసోమనర్సయ్య, పాశం దేవయ్య మల్లయ్య కనకం రాజమల్లు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

'విద్యార్థుల భవిష్యత్‌తోనే తల్లిదండ్రుల అభివృద్ధి'

తొర్రూరు రూరల్, జనవరి 3 : విద్యార్థుల ఉన్నతమైన భవిష్యత్‌తోనే తల్లిదండ్రులు, సమాజాభివృద్ధి సాధ్యమవుతోందని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. చెర్లపాలెం గ్రామవాసి, ఎన్ఆర్ఐ, ప్రముఖ గుండె వైద్యనిపుణుడు హనుమాండ్ల రాజేందర్‌రెడ్డి 67వ పుట్టినరోజు సందర్భంగా చెర్లపాలెం ఉన్నత పాఠశాలలో నిర్వహించుకొని, 5 నుంచి 10వ తరగతి వరకు ప్రతిభ కనబర్చిన 15 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కాగా, హరిపిరాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ నాగలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం మహంకాళి బుచ్చయ్య, ఎంపీటీసీ ధర్మారపు కిరణ్, హనుమాండ్ల తిరుపతిరెడ్డి, సోమ సత్యయ్యాచారి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, మండల యూత్ అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్ యాదవ్ కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

తొర్రూరు, జనవరి 3: పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. హనుమాండ్ల రాజేందర్ రెడ్డి జన్మదిన సందర్భంగా తొర్రూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ, కేక్ కటింగ్ అనంతరం విశ్రాంతి భవనంలో రెండవ వార్డు కౌన్సిలర్ తూనం రోజా ప్రభుదాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు సోమరాజశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీధర్, మీరజ్, జ్వలిత, నితీష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'ప్రజాపాలనతో పేదలకు సంక్షేమ పథకాలు'


కంచర్లగూడెంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న శశాంక

కురవి, జనవరి 3 : ప్రజాపాలనలో దరఖాస్తులతో నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని కలెక్టర్ శశాంక అన్నారు. కురవి మండలం కంచర్లగూడెంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని రాజోలు, బలపాల, కురవి లింగ్యాతండా, బలపాల లింగ్యాతండాల్లో ప్రజాపాలన కార్యక్రమం కొనసాగింది. తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీవో సరస్వతి, ఏవో మంజుఖాన్ పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దవంగర, జనవరి 3 : రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఈదురు రాజేశ్వరి, జడ్పీటీసీ శ్రీరాం జ్యోతిర్మయిసుదీర్ అన్నారు. కొరిపెల్లి, పోచంపల్లి, అవుతాపురం, వడ్డెకొత్తపల్లి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో వారు పాల్గొని, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండల ప్రత్యేకాధికారి ఖుర్షీద్, తహసీల్దార్ మహేందర్, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీవో సత్యనారాయణ, ఏపీవో రమణాచారి, సర్పంచ్‌లు ప్రవీణ్‌రావు, గాజుల శోభ, సల్గెండి మంజుల, ఎంపీటీసీ రూస్సీ, ఆర్‌ఐ లష్కర్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, చంద్రశేఖర్, వీరారెడ్డి పాల్గొన్నారు.

తానంచర్లలో గ్రామసభ

మరిపెడ రూరల్, జనవరి3 : ప్రభుత్వం అర్హులైన అబ్ధిదారులను గుర్తించి, సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రజాపాలనకు శ్రీకారం చుట్టిందని తహసీల్దార్ సైదులు అన్నారు. తానంచర్లలో గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. ప్రభుత్వం కల్పించే ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం దరఖాస్తులను స్వీకరించారు. సర్పంచ్ దిగజర్ల శ్వేతా ముఖేష్, పాశం నరోత్తమ్‌రెడ్డి, కందిబండ ప్రసాద్, సీత వెంకన్న పాల్గొన్నారు.

సర్పంచ్‌కు మాజీ ఎమ్మెల్యే రెడ్యా పరామర్శ

డోర్నకల్, జనవరి 3 : మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, వెన్నారం గ్రామసర్పంచ్ బోయినపల్లి వెంకన్నను బుధవారం మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పరామర్శించారు. వారంరోజుల క్రితం వెంకన్న తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఆపై ఇంటికి వచ్చిన వెంకన్నను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ బిక్షంరెడ్డి,మండల బీఆర్ఎస్ అధ్యక్షులు నున్న రమణ, నాయకులు కోటిలింగం, రామనాథం, వీరన్న, ఎంపీపీ బాలునాయక్, కల్లెపు సతీష్‌గౌడ్, డీఎస్.కృష్ణ, ఉపేందర్ ఉన్నారు.

● సీరోలు : మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నాయిని రామకృష్ణరెడ్డి చిత్రపటం వద్ద డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయన వెంట ఎంపీటీసీ బోజ్యానాయక్, నాయకులు మక్కల వెంకన్న, తగరం వెంకన్న, గోపన్న, మల్లయ్య, సహదేవ్, వీరన్న పాల్గొన్నారు.

'వట్టివాగులో సాగునీటిని వదలాలి'

కేసముద్రం, జనవరి 3 : అర్పనపల్లి, కాట్రపల్లి, ఉప్పరపల్లి, పెనుగొండ గ్రామాల్లో వందలాది ఎకరాల్లో సాగునీరందించేందుకు వట్టివాగులో ప్రతీ నెల నీటిని వదలాలని కోరుతూ ఎమ్మెల్యే మురళీనాయక్‌కు ఎంపీటీసీ గుగులోత్ సునీతదస్రూనాయక్ విజ్ఞప్తి చేశారు. కేసముద్రం మండలం కాట్రపల్లి, ఉప్పరపల్లి, బేరువాడ, తాళ్లపూసపల్లి గ్రామాల్లోని ప్రజాపాలన కార్యక్రమాలకు బుధవారం ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా కాట్రపల్లిలో ఎమ్మెల్యేకు పలు సమస్యలపై ఎంపీటీసీ వినతిపత్రం అందజేశారు. అర్పనపల్లి, కాట్రపల్లి గ్రామాల మధ్య బీటీ రోడ్డు పూర్తిగా గుంతలమయైందని, దాన్ని మరమ్మత్తులు చేయాలని, వట్టివాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. సర్పంచ్‌లు జల్లె సైదమ్మ, ఎలబోయిన సారయ్య, ముదిరిగి సాంబయ్య, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో సమస్యలపై సీపీఐ విజ్ఞప్తి



ప్రజాపాలనలో అధికారులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఐ నాయకులు

మహబూబాబాద్ టౌన్, జనవరి 3 : పట్టణంలో జరుగుతున్న ప్రజాపాలనలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నేతలు విజ్ఞప్తి చేశారు. స్థానిక 18వ వార్డులో సీపీఐ ఆధ్వర్యంలో ప్రజాపాలనలో వార్డు అధికారి, విద్యుత్ ఏఈ సంగీతకు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్ మాట్లాడారు. 18వ వార్డులో అన్ని ప్రాంతాల్లో పైపులైన్ నిర్మాణం చేపట్టలేదని దానిని వెంటనే పూర్తి చేయాలని కోరారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ పోల్స్ స్థానంలో కొత్తపోల్లను ఏర్పాటు చేయాలన్నారు. ముకుంద థియేటర్ నుంచి గాంధీపురం వరకు రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారిందని తక్షణమే మరమ్మతులు చేయించి, రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నారు. మంద శ్రీనివాస్, గొల్లగోపు కిషోర్, వెంకటేశ్వర్లు, అనిల్, మంద లోకేష్, శ్రీను పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జిని కలిసిన బలరాంనాయక్

మహబూబాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని బుధవారం కేంద్ర మాజీమంత్రి పోరిక బలరాంనాయక్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలు, రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయాలపై చర్చించారు.


హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కలిసిన కేంద్ర మాజీమంత్రి బలరాంనాయక్